

వీసీలో మాట్లాడుతున్న వికాస్‌రాజ్, హాజరైన కలెక్టర్, అధికారులు

## ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించాలి..

**ఎన్నికల ప్రధాన అధికారి వికాస్‌రాజ్**

నిర్మల్ టౌన్, ఏప్రిల్ 17: పార్లమెంట్ ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ వికాస్‌రాజ్ అధికారులను ఆదేశించారు. బుధవారం సాయంత్రం హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్(వీసీ) ద్వారా కలెక్టర్లతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వికాస్‌రాజ్ మాట్లాడుతూ.. రేపటి నుంచి ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం కానున్నందున ఏర్పాట్లను పూర్తి చేయాలని ఆదేశించారు. నామినేషన్లు వేసే ప్రతి అభ్యర్థి నుంచి ఐదు ఫొటో కాపీలను తీసుకోవాలని తెలిపారు. ఈ ఫొటో కాపీలలో రాజకీయ, మత గుర్తులు, చిహ్నాలు ఉండరాదని ఆదేశించారు. ఓటరు కార్డులలో పేరు, చిరునామా మార్పు కోసం వచ్చిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి ఆ ప్రక్రియను జాగ్రత్తగా, పారదర్శకంగా పూర్తి చేయాలని అన్నారు. అర్హులైన వారందరికీ పోస్టల్ బ్యాలెట్లు, హోం ఓటింగ్ సౌకర్యం కల్పించాలని తెలిపారు. ఎండలు అధికంగా ఉన్నందున పోలింగ్ కేంద్రాల్లో టెంట్లు, తాగునీటి సౌకర్యం కల్పించాలని ఆదేశించారు. పోలింగ్ కేంద్రాల వద్ద అన్ని సూచనలను బోర్డు రూపంలో ఏర్పాటు చేయాలన్నారు. సోషల్ మీడియాలో పుకార్లు వ్యాపించకుండా నిఘా ఏర్పాటు చేయాలని తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్, రెవెన్యూ అదనపు కలెక్టర్ కిశోర్ కుమార్, నిర్మల్, భైంసా, ఉట్నూర్ ఆర్డీవోలు రత్నకల్యాణి, కోమల్‌రెడ్డి, జీవక్‌రెడ్డి, డీఆర్వో భుజంగ్ రావ్, ఈడీఎం నదీం పాల్గొన్నారు.



కవాతులో ఎస్పీ గౌష్ ఆలం, డీఎస్పీలు జీవన్‌రెడ్డి, శ్రీనివాస్, సీఐలు

## శాంతిభద్రతల కోసమే కవాతు

ఎదులాపురం, ఏప్రిల్ 17 : ఆదిలాబాద్ పట్టణంలో శాంతి భద్రతల రక్షణ కోసమే కేంద్ర పోలీసు బలగాలతోపాటు స్థానిక పోలీసులు కవాతు నిర్వహించినట్లు ఎస్పీ గౌష్ ఆలం తెలిపారు. శ్రీ రామనవమి సందర్భంగా అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా ప్రజల్లో భరోసా కల్పించడానికి ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. స్థానిక వినాయక్ చౌక్ నుంచి ప్రారంభమై ఓల్డ్ బస్టాండ్, దేవిచాంద్‌చౌక్, గాంధీచౌక్, అంబేద్కర్ చౌక్, నేతాజీ చౌక్ మీదుగా తిరిగి వినాయక్ చౌక్ వరకు చేరుకున్నారు. ఈ ఫ్లాగ్‌మార్చ్‌లో డీఎస్పీలు జీవన్‌రెడ్డి, శ్రీనివాస్, సీఐలు సత్యనారాయణ, అశోక్ పాల్గొన్నారు.

## కోమటిరెడ్డికి మతిస్థిమితం లేదు..

నిర్మల్ చైన్‌గేట్, ఏప్రిల్ 17 : మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి మతిస్థిమితం కోల్పోయి మాట్లాడుతున్నాడని నిర్మల్ జిల్లా వెలమ సంఘం మాజీ అధ్యక్షుడు శ్రీధర్‌రావు పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం ఆయన కోమటిరెడ్డి వ్యాఖ్యలను నిరసిస్తూ ప్రకటన విడుదల చేశారు. వెలమ సామాజిక వర్గాన్ని కించపరిచేలా మాట్లాడడం సరికాదన్నారు. వెలమ సామాజిక వర్గానికి బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

## కార్యకర్తలతో క్యారం ఆడి..

ఎదులాపురం, ఏప్రిల్ 17 : నిత్యం ప్రజా జీవితంలో విశ్రాంతి ఎరుగని ప్రజా నాయకుడు, మాజీ మంత్రి జోగు రామన్న మంగళవారం రాత్రి బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో బీఆర్‌ఎస్ కార్యకర్తలతో కాలక్షేపం చేశారు. బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు విజ్జగిరి నారాయణ, పార్టీ నాయకుడు జగదీశ్, రాజన్న, భూమన్నలతో కలిసి క్యారం ఆడి ఉత్సాహపరిచారు.



కార్యకర్తలతో క్యారం ఆడుతున్న మాజీ మంత్రి రామన్న

# నేటి నుంచే నామినేషన్ల పర్వం

**25 వరకు ఆదిలాబాద్ ఎంపీ స్థానానికి స్వీకరణ**

- ఆదిలాబాద్ కలెక్టరేట్‌లో రిటర్నింగ్ అధికారి కార్యాలయం
- సిర్పూర్, ఆసిఫాబాద్ అసెంబ్లీ నియోజకవర్గాల్లో 4 వరకు పోలింగ్
- సీ-విజిల్, 1950 ఫిర్యాదు చేయాలి
- పార్లమెంట్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి రాజర్షి షా




మాట్లాడుతున్న రిటర్నింగ్ అధికారి రాజర్షి షా, పక్కన ఎస్పీ గౌష్ ఆలం




కలెక్టరేట్‌లో రిటర్నింగ్ అధికారి కార్యాలయం

ఆదిలాబాద్, ఏప్రిల్ 17(నమస్తే తెలంగాణ) : మే 13వ తేదీన జరిగే పార్లమెంట్ ఎన్నికల నిర్వహణలో భాగంగా ఆదిలాబాద్(ఎస్టీ) నియోజకవర్గానికి, నేడు(గురువారం) నోటిఫికేషన్ విడుదల చేయనున్నట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి రాజర్షి షా తెలిపారు. బుధవారం ఆదిలాబాద్ కలెక్టర్ సమావేశ మందిరంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నేటి నుంచి ఈ నెల 25వ తేదీ వరకు నామినేషన్లను స్వీకరించడానికి ఆదిలాబాద్ కలెక్టరేట్‌లో రిటర్నింగ్ అధికారి కార్యాలయం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 26న నామినేషన్ల పరిశీలన ఉంటుందని, 29 వరకు ఉపసంహరణకు అవకాశం ఉన్నట్లు పేర్కొన్నారు. ఆదిలాబాద్ పార్లమెంట్ పరిధిలో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలు ఉండగా.. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు సిర్పూర్, ఆసిఫాబాద్ నియోజకవర్గాల్లో ఉదయం 7గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ కొనసాగుతుందన్నారు. ఆదిలాబాద్, బోథ్, నిర్మల్, ముథోల్, ఖానాపూర్ నియోజకవర్గాల్లో ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ ఉంటుందన్నారు. నామినేషన్ల స్వీకరణ కోసం అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు అభ్యర్థులు నామినేషన్లను దాఖలు చేయవచ్చని, ఆర్వో కార్యాలయం వంద మీటర్ల పరిధిలో నిషేధాజ్ఞలు అమలులో ఉంటాయన్నారు. అభ్యర్థితో కలిపి ఐదుగురు నామినేషన్ సమయంలో లోనికి అనుమతి ఉంటుందని పేర్కొన్నారు. ఆదిలాబాద్ ఆర్డీవో అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారిగా వ్యవహరిస్తారని తెలిపారు. వివిధ పార్టీల నాయకులతో ఇటీవల సమావేశం ఏర్పాటు చేసి ఎన్నికల్లో భాగంగా తీసుకోవాల్సిన చర్యల గురించి తెలియజేసినట్లు చెప్పారు. పోటీ చేసే అభ్యర్థుల రూ.95 లక్షల వ్యయ పరిమితి ఉందని, ఇందుకు సంబంధించిన రిజిస్టర్లు రాయాలని సూచించారు. ఎన్నికల ప్రచారం మే 11 సాయంత్రం 4 గంటలకు ముగుస్తుందన్నారు.

### నియోజకవర్గంలో 16,44,715 మంది ఓటర్లు

ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలో 16,44,715 మంది ఓటర్లు ఉన్నారని రిటర్నింగ్ అధికారి రాజర్షి షా తెలిపారు. 8,25,075 మంది పురుషులు, 8,42,054 మంది మహిళలు, 86 మంది ఇతరులు, 2,115 మంది సర్వీస్ ఓటర్లు ఉన్నట్లు పేర్కొన్నారు. నియోజకవర్గంలో 2,111 పోలింగ్ కేంద్రాలతోపాటు 86 ఎక్సలరీ పోలింగ్ స్టేషన్లు ఉన్నాయన్నారు. ఉద్యోగులకు ఈ ఎన్నికల్లో పోస్టల్ బ్యాలెట్‌తోపాటు వారి సొంత నియోజకవర్గాల్లో ఓటు వేసే అవకాశం కల్పించినట్లు తెలిపారు. వృద్ధులు, దివ్యాంగుల కోసం హోం ఓటింగ్‌లో భాగంగా ఫారం 20 పంపిణీ చేశామన్నారు. కోడ్ అమలులో భాగంగా రూ.50 వేలకు మంచి ఆధారాలు లేకుండా తీసుకుపోతున్న నగదును పట్టుకోవడం జరుగుతుందని, గ్రీవెన్స్ టీంలు ఆధారాలు చూపెడితే డబ్బు తిరిగి అందచేస్తున్నామన్నారు. ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించిన వారిపై ప్రజలు సీ-విజల్, 1950 నంబర్లకు ఫిర్యాదు చేయాలని సూచించారు. నియోజకవర్గ పరిధిలో 252 క్రిటికల్ పోలింగ్ స్టేషన్లు ఉన్నాయని, ఎన్నికల సంఘం నుంచి జనరల్, వ్యయ పరిశీలకులు వస్తారన్నారు. జిల్లాలో పోలింగ్ శాతం పెంచడానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని, పోలింగ్ స్లిప్ పంపిణీ పకడ్బందీగా నిర్వహిస్తామన్నారు. 18 ఏండ్లు నిండిన యువత వద్ద నుంచి సంకల్ప పత్రాలను స్వీకరించామన్నారు.

### పటిష్ట బందోబస్తు

**- ఎస్పీ గౌష్ ఆలం**

ఆదిలాబాద్ జిల్లాలో పార్లమెంట్ ఎన్నికల నిర్వహణకు పటిష్ట పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎస్పీ గౌష్ ఆలం తెలిపారు. ఛత్తీస్‌గఢ్ కాల్పుల నేపథ్యంలో అప్రమత్తంగా ఉన్నట్లు పేర్కొన్నారు. జిల్లాలోని మహారాష్ట్ర సరిహద్దుల్లో ఆరు అంతర్రాష్ట్ర చెక్‌పోస్టులు ఏర్పాటు చేశామన్నారు. జిల్లాలో ఇప్పటివరకు రూ.32, 48,062 నగదు, రూ. 7,94,770 విలువ చేసే 2,308 లీటర్ల లిక్కర్, రూ.7,57, 450 విలువైన గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. 20 లైసెన్స్ ఆయుధాలను తీసుకున్నామన్నారు. జిల్లాకు రెండు కంపెనీల కేంద్ర బలగాలు వచ్చాయని, ప్రజలు ప్రశాంత వాతావరణంలో తమ ఓటు హక్కును వినియోగించుకునేలా చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ఈ సమావేశంలో డీపీఆర్వో తిరుమల పాల్గొన్నారు.

### నామినేషన్లకు ఏర్పాటు..

ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలో నేటి నుంచి నామినేషన్ల ప్రక్రియ ప్రారంభంకానుండగా అధికారులు అవసరమైన ఏర్పాట్లు చేశారు. కలెక్టర్ కార్యాలయంలో నామినేషన్లు స్వీకరించనుండగా వంద మీటర్ల వరకు బారికేడ్లు ఏర్పాట్లు చేశారు. నేటి నుంచి ఈ నెల 25 వరకు నామినేషన్ల సమయం ఉదయం 11 గంటల నుంచి 3 గంటల వరకు పోలీసులు ఎవరిని అనుమతించరు. నామినేషన్ల సందర్భంగా ఏర్పాట్లను కలెక్టర్ రాజర్షి షా పరిశీలించారు.



కలెక్టర్ కార్యాలయం ఎదుట ఏర్పాటు చేసిన బారికేడ్లు

## మైదానం కాదండీ.. గుర్రపు డెక్కల మొక్కలండీ..



కంచరోడి చెరువులో గుర్రపు డెక్క మొక్కులు

**చిత్రంలో కనిపిస్తున్నది** క్రీడా మైదానం అనుకుంటే పొరబడినట్టే.. నిర్మల్ పట్టణంలోని కంచరోడి చెరువులో గుర్రపు డెక్కల మొక్కలు పెరగడంతో ఇలా కనిపిస్తున్నది. కంటికి నీటి చుక్కా కనిపించడం లేదు. పచ్చని మైదానాన్ని తలపిస్తున్నది. ఈ గుర్రపు డెక్కల మొక్కలను తొలగించడానికి గత ప్రభుత్వాలు నిధులను కేటాయించేవి. కానీ.. కాంగ్రెస్ సర్కారు నిధులు మంజూరు చేయడం లేదు. *- నిర్మల్ టౌన్, ఏప్రిల్ 17*



భైంసాలో రాముని విగ్రహంతో శోభాయాత్రగా వెళ్తున్న భక్తులు

## కనుల పండువగా రాములోరి లగ్గం

**ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లావ్యాప్తంగా శ్రీరామ నవమి వేడుకలు**

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లావ్యాప్తంగా బుధవారం సీతారాముల కల్యాణం అంగరంగ వైభవంగా కొనసాగింది. రామాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య పెండ్లి తంతు చేశారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన షామీయాలలో కూర్చొని భక్తులు వేడుకను తిలకించారు. ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. హనుమాన్ భక్తులు, యూత్ మండలి సభ్యులు శ్రీరాముని ప్రతిమలు, జెండాలు పట్టుకుని పెద్ద ఎత్తున ర్యాలీలు నిర్వహించారు. పల్లకీ సేవ నిర్వహించారు. హనుమాన్ దీక్షాదారులు కూడా శోభాయాత్రయలో పాల్గొన్నారు. స్వచ్ఛంద సేవా సంస్థల ఆధ్వర్యంలో పులిహోర, ప్రసాదం, అంబలి, మంచినీరు, జ్యూస్‌లను భక్తులకు ఉచితంగా అందించారు. పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. పోలీసులు బందోబస్తు నిర్వహించారు. కల్యాణ మహోత్సవానంతరం భక్తులకు తీర్థప్రసాదాలు, బెల్లం పాణకం, వడపప్పు వితరణ చేశారు. - నమస్తే, నెట్‌వర్క్



సీతారాముల విగ్రహమూర్తులు



నీరులేక ఎండిపోయిన కొత్త చెరువు

# పంట ఎండుతోంది..

*నెర్రలువారిన చెరువు.. అందని సాగు నీరు..*


- తెగిన కాల్వకు మరమ్మతులు చేసుకున్న రైతులు
- అయినా నీటిని వదలని అధికార యంత్రాంగం
- మూడు తడుల నీరివ్వాలని అన్నదాతల వేడుకోలు

*మందపల్లి కొత్త చెరువుకు శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నుంచి డీ-28 కాలువ ద్వారా సాగు నీరు అందుతున్నది. దీని ఆయకట్టు కింద 100 మందికిపైగా రైతులు ఈ యాసంగిలో దాదాపు 200 ఎకరాల్లో వరి వేశారు. ప్రస్తుతం వరి పొట్ట దశలో ఉంది. కొన్ని రోజుల క్రితం ఖానాపూర్ మండలంలోని సింగాపూర్ గ్రామం వద్ద డీ-28 కాలువ తెగింది. ప్రవాహం నిలిచిపోవడంతో కొత్త చెరువు ఎండింది. కాల్వకు మరమ్మతులు చేపట్టాలని అధికారులకు విన్నవించిన పట్టించుకోలేదు. దీంతో పంటలను కాపాడుకునెందుకు ఈ నెల 1న ఆయకట్టు రైతులు శ్రమించి తెగిన కాల్వకు మరమ్మతు చేపట్టారు. అయినా వారి శ్రమకు ఫలితం లేదు. సాగు నీటి కోసం తీవ్ర కష్టాలు పడాల్సి వచ్చిందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. డీ-28 కాల్వకు నీటిని నిలుపుదల చేయడంతో పంటలు ఎండిపోతున్నాయి. ప్రస్తుతం పంట పొట్ట దశలో ఉందని, కనీసం మరో మూడు తడులు అందిస్తేగాని చేతికోచ్చే పరిస్థితి లేదని రైతులు వాపోతున్నారు. నీరు అందిస్తే 7వేల క్వింటాళ్లు వచ్చే అవకాశం ఉండగా.. నీరివ్వకపోతే 2 వేల నుంచి 3 వేల క్వింటాళ్లు మాత్రమే వస్తుందని అధికారులు పేర్కొంటున్నారు. అధికారులు వెంటనే స్పందించి నీళ్లు విడుదల చేసి పంటను కాపాడాలని రైతులు వేడుకుంటున్నారు.* ***- పెంబి, ఏప్రిల్ 17***



పొట్ట దశలో ఎండుతున్న వరి పైరు

### సాగు నీరివ్వండి..



*యాసంగికి సాగు నీరు అందిస్తామని ప్రభుత్వం ప్రకటించడంతో కొత్త చెరువు ఆయకట్టు కింద రెండు వేల ఎకరాల్లో వరి వేశాం. డీ-28 కాలువ తెగిపోవడంతో మరమ్మతులు కూడా చేపట్టినం. రాత్రింబవళ్లు కష్టపడ్డం. అయినప్పటికీ కాల్వ ద్వారా నీరు రావడం లేదు. చివరికి తడికి నీళ్లు అందక పంట ఎండిపోతున్నది. వెంటనే సాగు నీరు అందించాలి.*

***- గుండవేణి భీమరాజు, రైతు, మందపల్లి.***



డీ-28 కాలువకు మరమ్మతు చేస్తున్న రైతులు



ఎండిన పంటను చూపుతున్న రైతు